# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 106 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల వల్ల కేసులను త్వరగా పరిష్కరించగలుతామని చెప్పారు. వీలైనంత వరకు ప్రతి ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహించవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్టేషన్ అభివృద్ధికి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ వినాయకరెడ్డి, డీఐ నాగరాజు, ఎస్ఐలు సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న డీఐ నాగరాజు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి డీఐ నాగరాజు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గణేశ్ నగర్‌లోని బేడ బుడగ జంగం నివాసులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు వహించాలో కాలనీ వాసులకు వివరించామని అన్నారు. మున్సిపాలిటీని శాంతి భద్రతల విషయంలో ఆదర్శంగా నిలపడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో విబూది లాలీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులతో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్, ఫిబ్రవరి 21: పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి కొహెడ వార్డు కార్యాలయంలో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- భక్తులకు ఏర్పాట్లు పూర్తి
- అందంగా ఆలయం ముస్తాబు
- ఐదు రోజుల పాటు జాతర



ఆరుట్లలో ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



ఆలయంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి



స్వామివారిని ఊరేగించే రథం

మంచాల, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏడాది నిర్వహించే వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎంపీటీసీలు చీరాల రమేశ్, కావలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. వేణుగోపాలస్వామి, రుక్మిణీదేవీల కల్యాణాన్ని నిర్వహించేందుకు కల్యాణ మండపాన్ని అందంగా తీర్చిదిద్దారు. గురువారం ఉదయం 9 గంటలకు కలశస్థాపన, అంకురార్పణతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఉదయం 8గంటలకు అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం, 11 గంటలకు గరుడమూఢ కార్యక్రమం, రాత్రి 8 గంటలకు వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం జరుగనుంది. శనివారం 9గంటలకు అగ్ని ప్రతిష్టాపన రాత్రి 7 గంటలకు హోమం, ఆదివారం ఉదయం 6 గంటలకు వేణుగోపాలస్వామి రథోత్సవం జరుగనుంది. దేవాలయం నుంచి విగ్రహమూర్తులను రథోత్సవంపై ఊరేగింపు కార్యక్రమం సాయంత్రం వరకు ఉంటుంది. సోమవారం ఉదయం 9 గంటలకు హోమం, సాయంత్రం 5 గంటలకు నాగవల్లిసేవ, రాత్రి 7గంటలకు పూర్ణాహుతితో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారు.ఉత్సవాల్లో రథోత్సవం సందర్భంగా కళాకారులు ఆటపాటలతో ప్రజలను అలరిస్తారు. ఇప్పటికే జాతరలో పెద్ద ఎత్తున దుకాణాలు కూడా వెలిశాయి.

### ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



వేణుగోపాలస్వామి ఆలయ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశాం. ఉచిత వైద్య సేవలను కూడా అందుబాటులో ఉంటుంది.

– చీరాల రమేశ్, ఎంపీటీసీ

## ఆమనగల్లు సీఐగా విజయ్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్‌కుమార్

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 :ఆమనగల్లు సీఐగా జి.విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లు స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయ్‌కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు.

## హామీలను వెంటనే అమలు చేయాలి

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలో నేటికి రైతులకు సక్రమంగా రైతుబంధు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు.

## అమ్మాయిని వేధించిన కేసులో యువకుడికి శిక్ష

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21: అమ్మాయిని వేధించిన కేసులో ముద్దాయికి మూడేండ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం చేవెళ్ల కోర్టు తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. 2019లో గుండాల శ్రీరామ్‌రెడ్డి (25) మర్పల్లికి చెందిన అమ్మాయిని వేధించారు. దీంతో ఆ యువతి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఐదేండ్ల నుంచి కోర్టులో కేసు నడుస్తున్నది. పోలీసులు పూర్తి ఆధారాలను కోర్టులో సమర్పించగా న్యాయమూర్తి మూడేండ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టులో దాఖలు చేసిన ఎస్సై లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను రాజేందర్ నగర్ డీసీపీ శ్రీనివాస్ అభినందించారు.

## రేపటి నుంచి సంగమేశ్వర బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, ఫిబ్రవరి 21 : కనకమామిడి గ్రామంలోని సంగమేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. 23న రుద్రహోమం, విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అగ్నిగుండాలు, 24వ తేదీన స్వామివారి అభిషేకం, స్వామి వారి దివ్య రథోత్సవం గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపు ఉంటుంది. 25వ తేదీన సత్యనారాయణ స్వామి వ్రతం, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం,అమ్మవారికి ఒడిబియ్యాలు, స్వామివారి పల్లకీ సేవలు, రాత్రి భక్తి కీర్తనలు, 26వ తేదీన మహామంగళహారతి, శివతీర్థం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు

- ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి



ప్రభుత్వ భూములను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్/ పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని ప్రభుత్వ, భూదాన్, వక్ఫ్ భూములను ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ప్లాట్లు చేసిన భూముల్లో తిరిగి లే అవుట్లు చేయడం, వ్యవసాయ భూములుగా మార్చిన వారి పై చర్యలు తప్పవని తెలిపారు. గ్రామ పంచాయతీ లే అవుట్లలో నూతనంగా ఏర్పడిన హెచ్ఎండీఏ, డీటీపీసీ లేఅవుట్ల పై విచారణ చేపట్టి, వాటి అనుమతులను రద్దు చేసేందుకు హెచ్ఎండీఏ, డీటీపీసీ సంస్థల వారికి తెలియజేస్తామని తెలిపారు. పిగ్లీపూర్ సర్వే నం 51, 17, బండరావిరాల 293, కుంట్లూరులో వివిధ సర్వేలలో గతంలో ప్లాట్లు చేసిన భూముల్లో తిరిగి లేఅవుట్ చేశారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వాటిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఆర్ఐ నిజాముద్దీన్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 24న నాగలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

మొయినాబాద్, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవాన్ని ఈ నెల 24న నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభం



మంచాల, ఫిబ్రవరి 21 : జాపాల హనుమాన్ దేవాలయం నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ. 5 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్, నాయకులు సంజీవ, దశరథ, లింగమయ్య, మహేశ్, శంకర్, దశరథ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను పేదలకు అందజేయాలి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంకర్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత



తీగాపూర్‌లో సీసీ రోడ్డు పనులకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు, ఫిబ్రవరి 21:సంక్షేమ పథకాలను పేదలకు చేర్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎంపీపీ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతర ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను కొత్తూరు నీటి సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావించిన తర్వాత తాగు నీరు రావడం ప్రారంభమైందన్నారు. రానున్నది ఎండకాలం కావున కరెంటు సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. వ్యవసాయ భూములకు మాత్రమే రైతుబంధు ఇస్తామని స్పష్టం చేశారు. మరో నెల రోజుల్లో కమ్మరిగూడ రోడ్డు, కొత్తూరు వై జంక్షన్ నుంచి చౌరస్తా వరకు గల రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

**చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్యే శంకర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదని చెప్పారు. సాధ్యమైనంత త్వరలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు.

**రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి**

రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. గూడూరు, రెడ్డిపాలెం, తీగాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి రోడ్ల అభివృద్ధి పైనే ఆధారపడి ఉందన్నారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి ఎస్‌తీగాపూర్‌లో రూ. 20 లక్షలు, గూడూరు రూ. 20 లక్షలు, రెడ్డిపాలె రూ.10 లక్షల విలువ చేసే సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బ్యాగరి సత్తయ్య, అంబటి ప్రభాకర్, చిర్ర సాయిలు, ఉప సర్పంచ్ దయానంద్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ దర్శన్, రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కారు పార్కింగ్ విషయంలో గొడవ

మొయినాబాద్, ఫిబ్రవరి 21: కారు పార్కింగ్ విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. కత్తులు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటన మండలంలోని సురంగల్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కుమార్‌యాదవ్, సోమ వెంకటేష్‌యాదవ్‌లు ఇద్దరు అన్నాదమ్ములు. వారి ఇంటి పక్కనే సోమ జ్ఞానేశ్వర్‌యాదవ్ అనే యువకుడి ఇల్లు ఉంది. జ్ఞానేశ్వర్ కారును వెంకటేశ్ ఇంటి ముందు రోడ్డులో పార్కింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఇరువురు మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. జ్ఞానేశ్వర్ కత్తులతో వీరంగం సృష్టించాడు. ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. వెంకటేష్‌యాదవ్ జ్ఞానేశ్వర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


## ఘనంగా ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న పండితులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 21 : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ (ఆదివారం) వరకు ఊరడమ్మ విగ్రహప్రతిష్ఠాపన, పోచమ్మ, మైసమ్మ ఆలయాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలు, జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు తొలుత పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం గ్రామ ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలూర్ మాజీ ఉప సర్పంచ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కసిరె వెంకటేశ్, ఆలూర్ ఎంపీటీసీ గోపులారం యాదమ్మపోచయ్య, గ్రామస్తులు అశోక్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి




జంగారెడ్డిపల్లి గ్రామంలో పాఠశాల గదులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

కడ్తాల్, ఫిబ్రవరి 21 : బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు, తండాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం జంగారెడ్డిపల్లి, పెద్దూరుతండాలో గల ప్రాథమిక పాఠశాలలో మండ ల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు గదులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయ న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో గ్రామాలు, తండాల రూపురేఖలు పూర్తిగా మారిపోయయాని తెలిపారు. నాలుగున్నరేండ్లలో అత్యధిక జడ్పీ నిధులను తీసుకువచ్చి మండలంలో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అంతకుముందు తలకొండపల్లి మండల కేంద్రంలో ఆశ్రమం పాఠశాల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో రఘు, ప్రత్యేకాధికారి గోపి, పీఏసీఎస్ డైరెక్టర్లు శేఖర్, యాదయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, నాయకులు శ్రీశైలంగౌడ్, జ్యోతయ్య, గోపాల్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కొత్తూరు, ఫిబ్రవరి 21 : కొత్తూరు మున్సిపాలిటీ 2024–25 బడ్జెట్‌ను రూ.62 కోట్ల 16 లక్షల 70 వేలుగా కొత్తూరు మున్సిపాలిటీ పాలకవర్గం ఆమోదించింది. కొత్తూరు మున్సిపాలిటీని బడ్జెట్‌ను బుధవారం జరిగాయి. ఈ సమావేశాల్లో మున్సిపాలిటీ 2024–25 బడ్జెట్‌ను రూ. 62.16 కోట్లుగా కమిషనర్ బాలాజీ ప్రవేశపెట్టగా మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో పాలకవర్గం దాన్ని ఆమోదించింది. మిగులు బడ్జెట్ 8 లక్షల 73 వేలుగా ఉండనుంది. ఇతర గ్రాంట్లు నుంచి 36 కోట్ల 30 లక్షలు వస్తాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. కొత్తూరు రైల్వే గేటు నుంచి కుమ్మరిగూడకు వెళ్లేదారికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు కొస్గి శ్రీనివాసులు, మాదారం నర్సింహాగౌడ్, వీరమోని హేమ, చింతకింది చంద్రకళ, సోమ్లానాయక్, జాండగూడెం అనిత, మాధవి, కమ్మరి జయమ్మ, ప్రసన్నలత పాల్గొన్నారు.



సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న తదితరులు

**35.41 కోట్లతో మున్సిపల్ బడ్జెట్**

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. బుధవారం తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 2024–25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.35.41 కోట్ల అంచనా ఆదాయం, రూ.35.23 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌పై సమగ్రంగా చర్చించి ఆమోదించారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఈ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ ఉమావతి

## గ్రామంలో వసతుల కల్పనకు కృషి

కడ్తాల్, ఫిబ్రవరి 21 : గ్రామంలో వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎంపీటీసీ పాలకూర్ల ఉమావతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సుమన్, యాదయ్య, రమేశ్ పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి 11 గుడిసెలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21: గ్యాస్ సిలిండర్ పేలి 11 గుడిసెలు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మోకిల గ్రామంలో జరిగింది. నానక్‌రామ్ గూడ అగ్ని మాపక అధికారి జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. మోకిల గ్రామంలోని ఫ్రైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల నివాసం కోసం విజేత సూపర్ మార్కెట్ వెనుక 50 గుడిసెలను నిర్మించారు. బుధవారం ఉదయం ఒక గుడిసెలో వంట చేసుకున్న తర్వాత గ్యాస్ ఆపివేయడం మర్చిపోయి పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో 11 గుడిసెలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. ఆ సమయంలో గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.